మూగజీవుల అన్నదాతలు


కుక్కలు, ఆవులకు బిస్కెట్లు, ఇతర తినుబండారాలు వేస్తున్న కిషోర్

మధురవాడ ఎంవీవీ సిటీలో **నివాసం ఉంటున్న** దువ్వి కిషోర్ ప్రకృతి ప్రేమికుడు. **వివిధ ప్రైవేటు** బ్యాంకుల్లో సేవలందించి, **ప్రస్తుతం వ్యాపారం** చేస్తున్న ఈయన 15ఏళ్లుగా జంతువులకు ఆహారం అందించడానికి రోజులో ఏదో ఒక పూట అయినా వీధుల్లో తిరుగుతారు. ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యం కోసం వాకింగ్‌కు వెళ్తారు. కానీ ఈయన మూగజీవుల ఆకలి తీర్చేందుకు ఇలా నడకబాట పట్టారు.

తమకేం కావాలో అడగలేని, ఆకలైతే అన్నం పెట్టమని కోరలేని మూగజీవులవి. రోడ్డుపై సంచరిస్తూ దొరికినవి తింటూ కాలం గడిపేస్తుంటాయి. అటువంటి జీవుల ఆకలిని తీరుస్తూ దయార్థ్ర హృదయాన్ని చాటుకుంటున్నారు పలువురు జంతు ప్రేమికులు. ఎండైనా, వానైనా లెక్క చేయకుండా క్రమం తప్పకుండా వాటికి ఆహారం అందిస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. నోరు తెరిచి అడగలేని వాటి ఆవేదనను అర్థం చేసుకుని, సేవలు అందిస్తున్న దాతల సేవలు ప్రశంసనీయం. – మధురవాడ

15ఏళ్లుగా వీధికుక్కల ఆకలి తీర్చుతూ..


మధురవాడ జాతరలో కుక్కలకు బిస్కెట్లు వేస్తున్న అరవింద్‌కుమార్

నగరంపాలేనికి చెందిన పోతిన అరవింద్‌కుమార్ మధురవాడ శిల్పారామం (జాతర)తో పాటు ఇతర ప్రాంతాలకు ఉదయం వాకింగ్‌కి వెళ్తారు. ఒక బ్యాగ్‌లో బిస్కెట్లు, రస్కులు లేదా ఏదైనా ఆహారం తీసుకుని వెళ్తారు. 15ఏళ్లుగా ఊర కుక్కలకు ఆహారం అందించి, వాటి ఆకలి తీరుస్తున్నారు.


కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డులో కుక్కలకు ఆహారం అందిస్తున్న టెర్రాస్ గార్డెనర్ రాయ్


ఆర్‌జీకే కాలనీలో కుక్కలకు బిస్కెట్లు అందిస్తున్న ఓ గృహిణి

కొమ్మాది జీసీసీ లేఅవుట్‌లో నివాసం ఉంటున్న **టెర్రాస్ గార్డెనర్ రాయ్** తన ఇంట్లో ఉన్న **మొక్కలు, కుక్కలతో పా**టు బైట వీధుల్లో సంచరిస్తున్న ఊర కుక్కలకు క్రమం తప్పకుండా ఉదయం, రాత్రి సమయాల్లో 20ఏళ్లుగా ఆహారం అందిస్తున్నారు.

మరికొందరు వాకర్స్, గృహిణులు కుక్కలు, ఆవులకు ఆహారం, నీరు అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరి సేవలను అభినందించి తీరాల్సిందే.


కుక్కలకు బిస్కెట్లు వేస్తున్న వాకర్లు

ఆదాయంలో కొంత కేటాయిస్తాను



మొక్కలు, పక్షులు, ఆవులతో పాటు ఊరిపై తిరిగే కుక్కలకు కూడా ఆహారం అందిస్తాను. ఇది నాకు దేవుడు ఇచ్చిన అవకాశంగా భావించి, చేస్తున్నాను. నేను ఎక్కడ ఉంటే అక్కడ ఈ పని చేస్తుంటాను. నా ఆదాయంలో కొంత మొత్తం వీటి కోసం కేటాయిస్తున్నాను.

– దువ్వి కిషోర్


ఊరకుక్కల పిల్లల కోసం అరవింద్ కుమార్ ఏర్పాటు చేసిన పాలు

చుట్టూ చేరతాయి



నేను మా ఇంటి నుంచి వాకింగ్ చేస్తే ప్రదేశం జాతర లేదా ఇతర ప్రాంతాలకు కనీసం 2 కిలో మీటర్లు అయినా వెళ్తాను. బయటికి ప్రతి రోజూ ఉదయం ఆహారంతోనే వెళ్తాను. అది ఇంట్లో నా భార్య తయారు చేసి ఇచ్చింది అయినా కావచ్చు, లేదంటే బిస్కెట్లు, ఇంకేమైనా అవి తినే వస్తువలు కొనుక్కుని వెళ్తాను. నాలాంటి వారిని చూడగానే కుక్కలు చుట్టూ చేరిపోతాయి. పెట్టమని అడుగుతున్నట్లే ఉంటుంది. ఆహారం అందించినంత వరకూ వదలవు.

– పోతిన అరవింద్ కుమార్

క్లుప్తంగా

భీమిలి జెడ్సీ అప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన అప్పలనాయుడు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కమిషనర్‌గా ఒమ్మి అప్పలనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ప్రేమప్రసన్న వాణిని అమరావతి డైరెక్టరేట్‌కు రిపోర్ట్ చేయాలని అధికారులు ఆదేశించారు. కాగా అప్పలనాయుడు మాట్లాడుతూ జాప్యం లేకుండా అన్ని పనులు నిర్వహిస్తానన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


దాతలు అందించిన జెర్సీలు, షూస్, బాల్స్ తదితర మెటీరియల్‌తో చిన్నారులు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో గురువారం శ్రీపోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు షార్ట్‌లు, జెర్సీలు, షూస్, బాల్స్ తదితర మెటీరియల్‌ను ఎస్.కృష్ణ, ఎస్.గురునాథ్‌ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడైన మంతెన రాంజీ అందించారు. శిబిరానికి కోచ్‌గా అనకాపల్లి శివ, బోర చినరెడ్డి వ్యవహరిస్తారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు, సీనియర్ క్రీడాకారులు శొంఠ్యాన జడ్సన్ రాబర్ట్‌సన్, చేట్ల వెంకటరెడ్డి, సన్ని, నమ్మి మురళి, వెంపాడ శ్రీనివాసరెడ్డి, అనకాపల్లి గిరి, మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డైట్ ప్రిన్సిపాల్‌గా సుధాకర్


బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకర్

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్‌గా ఇక్కడ పని చేస్తున్న సీనియర్ అధ్యాపకుడు ఎల్.సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఎం.జ్యోతికుమారి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా వేములవలస, ఆనందపురం, ఎస్సీ బీసీ కాలనీ, బంటుపల్లి కళ్లాల రోడ్డు, సత్యకల్యాణి అపార్ట్‌మెంట్స్ ప్రాంత గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైద్యుని సేవలకు గుర్తింపు



డాక్టర్ సూరిబాబుకు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన డాక్టర్ పల్లా సూరిబాబుకు ఇంటర్నేషనల్ బెస్ట్ హెల్త్ కేర్ అవార్డు లభించింది. గత నెల 30న ఈ అవార్డును నగరంలోని లైబ్రరీ హాల్లో ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్‌వైడ్ ఫౌండేషన్ అందించింది. సూరిబాబు ఎన్నో ఏళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలు అందించారు. బెస్ట్ ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాలను గుర్తించి, అవార్డు వరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీవీజీ రాజుకు నివాళులు

తగరపువలస: ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో పీవీజీ రాజు 101వ జయంతిని గురువారం నిర్వహించారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, ఏలూరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అరుణ పతాక రెపరెపలు

వాడవాడలా మే డే వేడుకలు


తగరపువలస ప్రైవేట్ మార్కెట్‌లో సిటు ఆధ్వర్యంలో మేడే వేడుకలు


బంగ్లామెట్ట వద్ద మినీ వ్యాన్ మోటారు కార్మికుల ఆధ్వర్యంలో ..



మెయిన్‌రోడ్డు గుజ్జు రామునాయుడు భవన్ వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ..

తగరపువలస/భీమునిపట్నం/కొమ్మాది/పద్మనాభం: వాడవాడలా అరుణపతాకం రెపరెపలాడింది. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కొమ్మాది, భీమిలి, మధురవాడ, పద్మనాభం, పీఎం పాలెం తదితర ప్రాంతాల్లో కార్మిక నాయకులు, ఆటో కార్మికులు జెండా ఎగరవేసి, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. చిట్టివలస కార్మికవాడలో సిటు, ఏఐటీయూసీ, సీపీఐ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగాయి. కార్మికులు, కర్షకులు, ముఠా, ఆటో, మోటారు తదితర కార్మికులు ఎర్రజెండా ఎగరవేశారు. ఆనందపురం మండలం వెల్లంకి, తర్లువాడ, రామవరం, బోయపాలెం, దుక్కవానిపాలెం, కుసులవాడ తదితర పారిశ్రామిక ప్రాంతాల్లోనూ కార్మికులు మేడే వేడుకలు జరుపుకొన్నారు. చిట్టివలస సిటు కార్యాలయం, భీమిలి బస్టాండ్, ప్రైవేట్ మార్కెట్, రాములమ్మ థియేటర్, తాటితూరు స్టాండ్, బంగ్లామెట్ట శివాలయం వద్ద వేడుకలలో ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, పంపాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. గుజ్జు రామునాయుడు భవన్ వద్ద లేబర్ యూనియన్ నాయకులు కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, చిల్ల అప్పలసూరి, చిల్ల రాంపైడి, బైరెడ్ల రాంబాబు, ఎరుసు అప్పలనరసయ్య తదితరులు పతాకాలను ఎగరవేసి మేడే ప్రాధాన్యత గురించి తెలియజేశారు.

సీఐటీయూ బైక్ ర్యాలీ

మధురవాడ: మధురవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కొమ్మాది జంక్షన్ వద్ద ప్రారంభమై కార్‌షెడ్, క్రికెట్ స్టేడియం, పీఎంపాలెం, బక్కన్నపాలెం రేవళ్లపాలెం మీదుగా మధురవాడ చేరుకుంది. ఇందులో సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్, అప్పలరాజు, శ్రీ దుర్గా, శ్రీ కృష్ణా, త్రిశక్తి భవన నిర్మాణ సంఘాలు నాయకులు, ప్రతినిధులు రాజశేఖర్, అప్పారావు, లక్ష్మణ అప్పన్న, మునలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- మధురవాడ పౌర సంక్షేమ సంఘం దివంగత కార్మిక నేత నాగోతి సింగన్న జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేసింది.
- మధురవాడ సీపీఐ ఆఫీసు వద్ద ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, హైస్కూల్ వద్ద ముఠా మేస్త్రి ఎం.బంగారయ్య, నగరంపాలెంలో సీనియర్ నాయకురాలు అప్పలకొండ, మల్లయ్యపాలెంలో కొల్లి రాములమ్మ పతాకాలు ఆవిష్కరించారు.
- సీఐటీయూ అనుబంధ శ్రీ గణపతి మొగదారమ్మ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు ఎం.రాము జెండా ఆవిష్కరించారు.
- 7వ వార్డు కార్యాలయం వద్ద విశాఖ జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంపీ ప్రసాద్ జెండా ఎగరవేశారు.

శిల్పారామంలో..

పీఎం పాలెం: స్థానిక శిల్పారామంలో జాతర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిందుస్థాన్ షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులు మే డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.బాబూరావు, ఈ.శేషగిరిరావు, ఎం. గోవింద్ పట్నాయక్, ఎన్.రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలి

తగరపువలస: కార్మికవర్గానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని ఐద్వా నాయకురాలు కె.నాగరాణి కోరారు. మేడే సందర్భంగా ఆనందపురం మండలంలో పలుచోట్ల జెండా ఎగరవేశారు. కార్మిక నాయకులు వీరన్న, శివశంకర్, అప్పలరాము, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.


నగరంపాలెం రోడ్డులో మజ్జిగ పంపిణీ చేస్తున్న నాగోతి సూర్యప్రకాశరావు తదితరులు


మధురవాడ పీహెచ్‌సీ వద జెండా ఎగరవేస్తున్న ఆశ కార్యకర్తలు


కొమ్మాది : రుషికొండలో శ్రీ పోలమాంబ చిల్లర వ్యాపార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ..

పద్మనాభం: సీఐటీయూ నాయకుడు రవ్వ నర్సింగరావు ఆధ్వర్యంలో కృష్ణాపురం, పద్మనాభం జంక్షన్, పద్మనాభం గ్రామంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద మే డే వేడుకలు నిర్వహించారు.


మున్సిపల్ ఉద్యోగుల సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎంపీ ప్రసాద్


సీఐటీయూ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు


మధురవాడ సీపీఐ ఆఫీసు వద్ద పతాకావిష్కరణ చేస్తున్న ఏరియా కార్యదర్శి సత్యనారాయణ


శిల్పారామంలో మే డే వేడుకలలో పాల్గొన్న షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులు


ఆనందపురంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు నాగరాణి


పద్మనాభంలో సీఐటీయూ నాయకుడు రవ్వ నర్సింగరావు ఆధ్వర్యంలో..

చెరువు పరిసరాలు శుభ్రంగా ఉంచండి

ఎమ్మెల్యే గంటా ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..


సంగివలస చెరువులో చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలస చెరువుతో పాటు పరిసరాలు, పార్కును పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భీమిలి జోనల్ అధికారులను ఆదేశించారు. 'సంగివలస చెరువులో చేపల మృత్యువాత' శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువులో చేపలు పెద్ద ఎత్తున మృతి చెందిన, దుర్వాసన వస్తుండటంతో చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బంది లేకుండా వాటిని తొలగించి బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. చెరువు నీరు కలుషితం కాకుండా నిత్యం శుభ్రంగా ఉండేలా అన్నిశాఖల సమన్వయంతో ప్రణాళికలు తయారు చేయాలన్నారు. చేపలు మృతి చెందడానికి గల కారణాలపై ఆరా తీశారు. వీటిని ఎవరు పెంచుతున్నారో కనుక్కోవాలని సూచించారు. చెరువు చుట్టూ పార్కులో మద్యం సీసాలను గమనించి రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని భీమిలి పోలీసులకు సూచించారు. చెరువులో మురుగునీరు కలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట భీమిలి తహసీల్దార్ పి.రామారావు, జోనల్ అధికారులు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పీఎం పాలెం: ఆవు రోడ్డుపైకి రావడంతో సడన్ బ్రేక్ వేయడంతో రెండు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొన్న ఘటనలో కార్లు పాక్షికంగా దెబ్బతినగా, అందులో ప్రయాణిస్తున్నవారు చిన్నపాటి గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి.. గురువారం ఉదయం 5గంటల ప్రాంతంలో నగరం వైపునుంచి ఆనందపురం వైపునకు హైవేపై వెళ్తున్న కారుకు మారికవలస కూడలికి సమీపంలో ఆవు అడ్డుగా వచ్చింది. దీంతో డ్రైవర్ కారుకు సడన్ బ్రేకులు వేశాడు. ఈ ఘటనలో వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో, రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కార్లలో ప్రయాణిస్తున్నవారు చిన్నపాటి గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు.

సర్వే నం. 355, 356లో ఆక్రమణలు

తగరపువలస: ఆనందపురం మండలం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఆనుకుని ఉన్న జగనన్న కాలనీ వద్ద సర్వే నంబర్ 355, 356లో ప్రభుత్వ భూమిపై ఆక్రమణదారులు కన్నేశారు. వారి వద్దనున్న పాత ఖాళీ పట్టాలను ఆసరా చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటిపై విచారణ జరిపించవలసిన రెవెన్యూ సిబ్బంది ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారంటున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్న ఈ సంఘటనలపై మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు మండల ప్రజలు తెలిపారు.

పహల్గాం మృతులకు టైలర్ల నివాళి


నివాళులు అర్పిస్తున్న 'ఎల్లమాంబ టైలర్స్' ప్రతినిధులు

తగరపువలస: ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గురువారం సాయంత్రం శ్రీ ఎల్లమాంబ టైలర్స్ సంక్షేమ సేవా సంఘం కొవ్వొత్తులతో నివాళులు అర్పించింది. అంబేద్కర్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో పాకిస్తాన్‌కు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వారంతా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పెంటపల్లి శ్రీనివాసరావు, చింతల సురేష్, నూలు గోవింద్, జోగ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభం

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చిన్నబజారు సమీపంలోని దచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఐ హరీష్ ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వేసవి ముగిసేవరకు నిర్వహిస్తామని తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'సత్యసాయి' ఆధ్వర్యంలో..

మధురవాడ: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మధురవాడ ఎంవీవీ సిటీ హైవే వద్ద గల బస్ షెల్టర్ వద్ద భక్తులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. 45 రోజుల పాటు భక్తుల సహాయ సహకారాలతో నిర్వహించే మజ్జిగ చలివేంద్రాన్ని జిల్లా అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎస్ నాయుడు ప్రారంభించారు. జిల్లా అంతటా అన్ని భజన మండళ్లు, మందిరాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంవీవీ సిటీ సాయిసెంటర్ నిర్వాహకులు జ్యోతి వెంకటశివాజీ, నాగవేణి, వెంకట కృష్ణారావు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.


భీమిలిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ హరీష్, శ్రీరామ్


మధురవాడ ఎంవీవీ సిటీ సమీపంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయిబాబా భక్తులు